క్లుప్తంగా

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

కాకినాడ డీఎల్‌పీఓ అన్నామణి



జి.మామిడాడలో కార్యదర్శితో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అన్నామణి

పెదపూడి: గ్రామ పంచాయతీ పరిధిలో పన్నుల వసూలు త్వరగా పూర్తి చేయాలని కాకినాడ డీఎల్‌పీఓ అన్నామణి సచివాలయం అధికారులకు ఆదేశించారు. జి.మామిడాడ గ్రామ పంచాయతీని ఆమె బుధవారం సందర్శించి, పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా అమలు చేయాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు.

జీవితాలను ప్రేమమయం చేసుకోవాలి



ఆడియో ఆవిష్కరణ చేస్తున్న ఆత్మ జ్ఞాన ప్రబోధకులు వివేకానంద

బిక్కవోలు: భగవద్గీత సమగ్ర సారాంశాన్ని భక్తులకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో రూపొందించిన శంఖారావం ఆడియో పాటను ట్రూత్ స్పిరిట్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, ఆత్మజ్ఞాన ప్రబోధకులు వివేకానంద ఆవిష్కరించారు. బుధవారం మండలంలోని బలభద్రపురం గ్రామంలోని ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ట్రూత్ వివేకామృతం ఆధ్యాత్మిక విజయోత్సవ వేడుకలు ఐదో రోజు వైభవంగా జరిగాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవాళి అవసరం కోసం జీవించటం, ఆశించి జీవించడం మానుకొని ప్రేమతో జీవించడం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సాధకులు హాజరయ్యారు.

నోటిఫికేషన్ జారీ చేయవద్దని ఆదేశాలు

సీతానగరం: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ ప్రకారం గురువారం జారీ చేయాల్సిన నోటిఫికేషన్ జారీ చేయవద్దని ఆదేశాలు వచ్చాయని జలవనరుల శాఖ ఏఈ శివ రామకృష్ణ బుధవారం తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నిక ఈ నెల 8న జరగాల్సి ఉండగా, షెడ్యూల్ ప్రకారం ఈ నెల 5న నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉందన్నారు. అయితే పైనుంచి వచ్చిన సూచనల మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ నిలిపివేశామన్నారు. 8న సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై ఎటువంటి ఆదేశాలు లేవని వివరించారు.

ప్రశాంతంగా పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ సర్వే

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ సర్వే పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు బుధవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3వ తరగతి బాలురు 402 మంది, బాలికలు 478 పరీక్ష రాశారన్నారు. 6వ తరగతి బాలురు 445, బాలికలు 533 మంది హాజరుకాగా, 9వ తరగతి బాలురు 462, బాలికలు 666 మంది హాజరయ్యారన్నారు. పరీక్షతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎంలకు ఇచ్చిన ప్రశ్నావళిని విధిగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించడానికి ఈ ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారన్నారు. జాంపేటలోని లూథరన్ ఎయిడెడ్ ఎస్‌కేవీటీలలో జరుగుతున్న పరీక్షను జిల్లా సర్వేక్షణ్ సర్వే కోఆర్డినేటర్ దేవా అనిత, ప్రధానోపాధ్యాయిని మేరీ పెరల్స్ పరిశీలించారు. పరీక్షల పరిశీలకుల నుంచి సమాచారాన్ని తీసుకున్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలోని బీఈఎమ్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, ఆంధ్రనగర్‌లోని పవర్స్ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలను, అశోకా థియేటర్ వద్ద ఎస్ఎస్‌బీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ పరీక్షను అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ సందర్శించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: ఐటీఐల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రావులపాలెంలోని లుమరిసే ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అప్రెంటిస్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ క్రిష్టన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కంపెనీలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్ ట్రేడుల్లో అర్హులకు అప్రెంటిస్ అవకాశాలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 7న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐటీఐ, రాజమహేంద్రవరంలో తమ దరఖాస్తులను, ఐటీఐ ఉత్తీర్ణత సర్టిఫికెట్ కాపీలతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

తడిసిన ధాన్యం.. కళ్లలో దైన్యం

- ఫెంగల్ తుపాన్ తెచ్చిన తంటా
- ధాన్యాన్ని ఆరబెట్టే పనిలో రైతన్నలు
- అక్కరకు రాని ప్రభుత్వ సహకారం



శ్రీరంగపట్నంలో రోడ్డుపై ధాన్యం ఆరబోత



మునగాలలో మెషీన్ ద్వారా వరి కోతలు

మధురపూడి: దేశానికి అన్నం పెడుతున్న రైతన్నలకు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకున్న కర్షకులపై ఫెంగల్ తుపాన్ నీళ్లు చల్లింది. పంట తడిచిపోవడంతో నష్టాలు తెచ్చిపెట్టింది. ఇటీవల వర్షాలకు ధాన్యంలో తేమ శాతం పెరగడంతో నిబంధనలు సడలించి, ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టే పనుల్లో వారు నిమగ్నమయ్యారు. రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో 26,297 హెక్టార్ల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు. వర్షాలకు తడిచిన ధాన్యాన్ని చెరువు గట్లు, లేఅవుట్లను కళ్లాలుగా చేసుకుని ఆరబెడుతున్నారు. ధాన్యాన్ని ఆరబెడితేనే గాని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనే పరిస్థితి లేదు. ప్రస్తుత ప్రభుత్వ సహకారం కొరవడటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పెట్టిన పెట్టుబడి అయినా రావాలని రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో 14,545 హెక్టార్ల విస్తీర్ణంలో వరి పండించారు. అనపర్తి నియోజకవర్గంలో 11,752 హెక్టార్లలో సాగు చేశారు. ఖరీఫ్‌లో మండలాల వారీగా కోరుకొండ మండలంలో 5,199 హెక్టార్లు, సీతానగరంలో 5,208 హెక్టార్లు, రాజానగరంలో 4,138 హెక్టార్ల విస్తీర్ణంలో పంట పండింది. అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి మండలంలో 3,623 హెక్టార్లు, బిక్కవోలులో 5,696 హెక్టార్లు, రంగంపేటలో 2,433 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు అయ్యింది. అంతా బాగుందని దిగుబడులు వస్తాయని అనుకున్న రైతన్నలకు తుపాన్ మొత్తం కష్టాలు తెచ్చింది. వర్షాల కారణంగా తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో కూటమి ప్రభుత్వం రైతన్నలకు ఎలాంటి సహకారం అందించడం లేదు. ఈ నేపథ్యంలో దళారుల ఇష్టారాజ్యం అయ్యింది. ధాన్యంలో తేమ శాతం పేరుతో ధర తగ్గించి కొంటున్నారు. ఇలా రైతులు నష్టపోయే పరిస్థితి ఎదురవుతోంది. తుపాన్‌కు భయపడి ఆదరాబాదరాగా వరి కోత మెషీన్లతో సాయంతో పంట ఒబ్బిడి చేశారు. ఈ నేపథ్యంలో ఎండి గడ్డి కొరత ఏర్పడుతోంది. దీనివల్ల పశువుల గ్రాసానికి ఇబ్బంది వస్తోంది.

ధర తగ్గించేశారు..



బీపీటీ 5204 తదితర రకాలైన సన్నాలను రైతులంతా ఎక్కువగా పండించారు. గతంలో వీటికి మంచి ధర పలికింది. దీంతో కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, మునగాల, కోటి, రాఘవపురం తదితర గ్రామాల్లో సన్నాలు సాగు చేశారు. గత ప్రభుత్వంలో 75 కిలోల ధాన్యం బస్తాకు రూ.1,700 అందించారు. ఈ ప్రభుత్వంలో రూ.1,400 అందించడం సరికాదు. ఇలా నష్టపోవాల్సి వస్తోంది.

– అత్తిలి శ్రీరామచంద్రమూర్తి, రైతు, శ్రీరంగపట్నం

తరుగుతో నష్టం



తేమ పేరిట ధాన్యంలో తరుగు తీయడంతో రైతులు నష్టపోతున్నారు. బస్తాకు 10 కిలోల చొప్పున నష్టపోవాల్సి వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తరుగు లేదు. కూటమి ప్రభుత్వం తరుగు విధానాన్ని వెనక్కి తీసుకోవాలి. గత ప్రభుత్వంలో కళ్లాల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసేవారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేశారు.

– కంటే వినయ్ తేజ, రైతు, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు

నేడే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక



రాజానగరంలో పోలింగ్ కేంద్రం ముంగిట చీకట్లోనే పోలీసులు



పెదపూడి ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీతాపతిరావు, నరేంద్రరెడ్డి



బిక్కవోలులో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ



అనపర్తి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్య కిషోర్

రాజానగరం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవికి గురువారం జరగనున్న ఎన్నికలకు అంతా సిద్ధమైంది. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 215 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. ఎంపిక చేసిన మూడు కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే పోలింగ్‌లో వీరంతా ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాజానగరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని మండల మహిళా సమాఖ్య (వెలుగు) కార్యాలయంలో 109 మంది, కోరుకొండ మండలం, కాపవరంలోని మండల విద్యా శాఖ కార్యాలయంలో 73 మంది, సీతానగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో 33 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

చీకట్లోనే పోలింగ్ కేంద్రాలు

గురువారం ఉదయం జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం డ్యూటీలు పడిన సిబ్బంది విధులకు బుధవారం సాయంత్రానికే చేరుకున్నారు. అయితే వారికి ఆయా కేంద్రాల వద్ద సరైన మౌళిక సదపాయాలు కూడా లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని మూడు పోలింగ్ కేంద్రాల్లో ఒకటిగా ఉన్న రాజానగరంలోని వెలుగు కార్యాలయం ముంగిట వెలుగు కరువైంది. కార్యాలయంలో సిబ్బంది కోసం వేసిన విద్యుత్ దీపాలు మినహా ఎన్నికల నిర్వహణ కోసం ఒక్క బల్బు కూడా అదనంగా అమర్చింది లేదు. అంతేకాక కార్యాలయం ముందు భాగంలో ఒక్క విద్యుత్ దీపం కూడా లేకపోవడంతో ఆ ప్రాంతమంతా కారు చీకట్లు అలముకున్నాయి. చుట్టూ వివిధ రకాల మొక్కలతో దట్టంగా ఉంటే ఈ ప్రాంతంలో పురుగు పుట్రా తిరుగుతుంటాయి. అటువంటి ప్రాంతంలో ఉన్న ఈ పోలింగ్ కేంద్రం ముందు ఒక్క విద్యుత్ దీపం చివరకు వీధి దీపం కూడా లేకపోవడంతో విధులకు వచ్చిన ఎన్నికల సిబ్బంది చీకట్లో అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగే వరకు నిత్యం కాపలా కాయాల్సిన పోలీసులు ఆ కారు చీకట్లోనే తమ సమయాన్ని గడపాల్సి వస్తుంది.

పెదపూడి మండలంలో..

పెదపూడి: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు గురువారం నిర్వహించనున్నామని దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ పీవీ.సీతాపతిరావు అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో గల ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీతాపతిరావు మాట్లాడుతూ మండలంలో 144 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికలు ఉదయం 7 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఎన్నికలు నిర్వహించే ప్రదేశానికి 200 మీటర్ల పరిధిలో నిబంధనలు విధించి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఆయన వెంట పీఓ, ఏపీఓ, ఓపీఓలు ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

పెదపూడి: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి పోలీసులు కృషి చేయాలని రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ అన్నారు. అనపర్తిలో గురువారం ఆమె పోలింగ్ కేంద్రాన్ని, పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు గానూ ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

రంగంపేట: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ రంజిత్‌కుమార్ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.

గురువారం జరిగే ఈ ఎన్నికకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. రంగంపేట మండలంలో మొత్తం 29 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఆయన తెలిపారు.

బిక్కవోలు: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు పూర్తి చేసినట్లు తహసీల్దార్ బీవీవీ కృష్ణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఒక బూత్ ఏర్పాటు చేశామన్నారు. 78 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వెల్లడించారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి వేళాయె..

- ఆలయాల్లో పూర్తయిన ఏర్పాట్లు
- నగరంలో ప్రసిద్ధి చెందిన ఆలయాలెన్నో



కోరుకొండ రోడ్డులోని సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాట్లు

సీటీఆర్ఐ: సుబ్రహ్మణ్య షష్ఠికి వేళయ్యింది.. ఆ స్వామిని కొలిచే వేడుకకు సర్వం సిద్ధమైంది. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలకు నగరంలోని ప్రముఖ ఆలయాలు ముస్తాబవుతున్నాయి. రాజమహేంద్రవరంలోని కోరుకొండ రోడ్డులోని ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వందేళ్ల పైబడి చరిత్ర కలిగిన ఈ సుబ్రహ్మణ్యేశ్వరుని దేవాలయంలో స్వామివారు నాగబంధ శివలింగంగా దర్శనమిస్తారు. నగరంలో సుబ్రహ్మణ్యేశ్వరుని ప్రధాన ఆలయం ఇదొక్కటే కావడం విశేషం. ఈ నేపథ్యంలో విశేష సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయశాఖ, ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సారి షష్ఠి 6వ తేదీ ఉదయం 10.48 గంటలకు ప్రారంభం కాగా, శనివారం ఉదయం 9.24 గంటలతో ముగిస్తోంది. అందువల్ల శనివారం ఉదయమే స్వామివారిని దర్శించుకుంటారని పండితులు చెబుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఇక్కడ ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయి. శనివారం తెల్లవారుజాము నుంచి స్వామివారి దర్శనాలకు భక్తులను అనుమతిస్తారు. అలాగే గోదావరి గట్టున ఉన్న శృంగేరి జగద్గురు శారదా మఠం, శంకర పీఠంలో అష్టనాగదేవత సహిత శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు నిర్వహించనున్నారు. కొన్ని వందల సంవత్సరాల క్రితం భూగర్భంలో దొరికిన స్వామివారిని ఇక్కడ ప్రతిష్ఠించారు. స్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు శంకర పీఠానికి తరలిరానున్నారు. గాయత్రీ అక్షర పీఠంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు జరగనున్నాయి.

నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

స్థానిక లాలాచెరువులోని చాడేశ్వరీనగర్‌లో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇక్కడ స్వామివారు సర్పరూపంలో దర్శనమిస్తారు. గురువారం ఉదయం 6 గంటలకు సుబ్రహ్మణ్య హోమం, 6న దివ్య కల్యాణం, 7న ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు, 9న ఉదయం 6 గంటలకు వసంతోత్సవం, సాయంత్రం నక్షత్ర హారతి, 15వ తేదీ అన్న సమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యుడు చింతా శ్రీనివాస్ తెలిపారు.

పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహణపై నీలినీడలు

బిక్కవోలు: రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ –టీచర్స్ డేను ప్రతి పాఠశాలలో నిర్వహించాలని ప్రభుత్వం ఇటీవల విద్యాశాఖాధికారులను ఆదేశించింది. దీన్ని ఓ పండగలా చేపట్టాలని, విద్యార్థుల తల్లిదండ్రులను, విద్యా కమిటీ సభ్యులను, స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి స్కూల్ ప్రగతిని చాటి చెప్పాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రోగ్రెస్‌ను తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ మెగా ఈవెంట్‌ను అందరి భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు. అయితే ఆ రోజు సుబ్రహ్మణ్య షష్ఠి కావడంతో ఉపాధ్యాయులు ఆలోచనలో పడ్డారు. ఏటా సుబ్రహ్మణ్య షష్ఠికి మండల వ్యాప్తంగా సెలవు ప్రకటించటం ఆనవాయితీగా వస్తోంది. మరో పక్క ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో ప్రజా ప్రతినిధులు హాజరు కాని పరిస్థితి ఉంది. దీనిపై ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో సమావేశంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

● గేటు పడితే అంతే!



కేశవరం రైల్వే గేటు వద్ద యర్రంపాలెం వైపు నిలిచిపోయిన వాహనాలు

రాజానగరం: మండలం నుంచి మండపేటకు వెళ్లే మార్గంలో ఉన్న కేశవరం రైల్వే గేటు వద్ద బుధవారం రాత్రి 8 గంటల సమయంలో అటుఇటు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రైళ్ల రాకపోకల సమయంలో ఈ గేటును మూసేస్తుంటారు. అయితే ఆ విధంగా మూసిన సమయంలో అటు మండపేటకు, ఇటు రాజానగరం మండలం జి.యర్రంపాలెం వైపునకు భారీగా వాహనాలు రావడంతో మైళ్ల కొలదీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఇదే పరిస్థితి అనేక పర్యాయాలు ఏర్పడుతుందని సంపత్‌నగరం సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు పి.రామకృష్ణ తెలిపారు. ఈ సమస్య నివారణకు రైల్వే ట్రాక్‌పై నుంచి ఫ్లెఓవర్ నిర్మించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇకనైనా సమస్య పరిష్కారానికి పాలకులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా వీరభద్రుడి సంబరం



బిక్కవోలులో వీరభద్రుడిని ఊరేగింపుగా తీసుకు వెళుతున్న దృశ్యం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన సుబ్బారాయుడి షష్ఠి ఉత్సవాలు ముందు నిర్వహించే వీరభద్రుడి సంబరాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. షష్ఠి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిక్కవోలుకు చెందిన జె.సురేష్ కుమార్‌రెడ్డి, సూర్య సౌజన్య దంపతులు, జె.ప్రతాప్‌రెడ్డి, లలితాంబ దంపతులు పీటలపై కూర్చొని సంబరం కర్తలుగా వ్యవహరించారు. ముందుగా గ్రామంలో ఊరేగింపుగా తీసుకొని వెళ్లి కాలువ వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షష్ఠి ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లివాసు తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల అంకితభావంతో మెలగాలి



దేవిడ్‌రాజు దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అంకిత భావంతో మెలగాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. తెలుగునాడు ట్రేడ్ యూనియన్ నాయకుడు కాశీ డేవిడ్‌రాజు అనపర్తి ఐటీసీ(ఐఎల్‌టీడీ)లో పనిచేసి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనకు సన్మాన సభ గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు హాజరయ్యారు. డేవిడ్ రాజు దంపతులకు ఎమ్మెల్యే దంపతులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐటీసీ యూనియన్ మాజీ ప్రెసిడెంట్ కోటిరెడ్డి, యూనియన్ నాయకులు కొండయ్య, శ్రీను, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వేగంగా దాళ్వా వరి నాట్లు



రాపాకలో పంట పొలంలో వేసిన నాట్లు

సీతానగరం: మండలంలో దాళ్వా వరి నాట్లు వేగంగా జరుగుతున్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో అధిక వర్షాలతో ఖరీఫ్‌లో వరి పంట ముంపులోకి వెళ్లి రెండు సార్లు నాట్లు కుళ్లిపోవడంతో మూడో సారి నాట్లు వేసిన పంట పొలాలు ఉన్నాయి. సుమారు మూడు వేల ఎకరాలు ముంపు నుంచి తేరుకోకపోవడంతో ప్రస్తుతం నేరుగా నాట్లు వేయడం రైతులు ప్రారంభించారు. దీనికి బెంగాల్ నుంచి వచ్చిన కూలీలు ఎకరానికి రూ.4,500 తీసుకుంటున్నారు. మండలంలో దాళ్వా వరి పంట సుమారు ఆరు వేల ఎకరాలకు పైగా ఉండవచ్చని అంచనా. మిగిలిన పొలాల్లో మొక్కజొన్న, వర్జీనియా పొగాకు, కూరగాయలను రైతులు పండిస్తున్నారు.

7 నుంచి రెవెన్యూ సదస్సులు

సీతానగరం: ఈ నెల 7 నుంచి మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల వద్ద ఈ సదస్సులు ఉంటాయన్నారు. 7 ములకల్లంకకు సంబంధించిన సదస్సును బొబ్బిల్లంక సచివాలయం–2 వద్ద, 10న మిర్తిపాడు, 12న మునికూడలి, 13న రఘుదేవపురం , 17న చినకొండేపూడి, 19న కాటవరం, జాలిమూడి సదస్సులు కాటవరం సచివాలయం వద్ద నిర్వహిస్తామన్నారు. అలాగే 21న సీతానగరం సచివాలయం –1 వద్ద, 24న సింగవరం, 26న నాగంపల్లి, 28న నల్గొండ, రాపాక (రాపాక సచివాలయం), 31న వంగలపూడిలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. జనవరి 2న పురుషోత్తపట్నం, 3న ఉండేశ్వరపురం, 4న కూనవరం, 7న ముగ్గళ్ల, 8న బొబ్బిల్లంక గ్రామ సచివాలయాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలు ఉంటే ఉపయోగించుకోవాలని తహసీల్దార్ సూచించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యం వ్యాన్, నిందితులతో పోలీసులు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం నుంచి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని బుధవారం కోరుకొండ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శ్యామ్ సుందర్ కథనం ప్రకారం.. 80 బస్తాల్లో రూ.1.38 లక్షల విలువైన బియ్యాన్ని వ్యాన్‌లో తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేసి పట్టుకున్నారు. నిందితులు బొజ్జపు శ్రీనివాస్, జోగవరపు కుమార్‌లను అరెస్టు చేశారు. ఆ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ విభాగం డీటీకి అప్పగించారు. రేషన్ బియ్యం తరలింపుపై కఠిన చర్యలుంటాయని ఎస్సై శ్యామ్‌సుందర్ హెచ్చరించారు.

రోశయ్యకు నివాళులు



రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్యులు

రాజానగరం: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య తృతీయ వర్ధంతిని స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహం ముంగిట రోశయ్య ఫొటోకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు సముద్రాల రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు గ్రంధి నానబ్బులు, వెంకన్నబాబు, దవులూరి గిరిబాబు, ముత్త రామకృష్ణ, కె.బాపిరాజు, పి.ఏడుకొండలు, నాగేశ్వరరావు, సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజానగరం: జాతీయ యువజనోత్సవంలో భాగంగా స్థానిక గైట్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు జరిగాయి. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'ది వికసిత్ భారత్' అనే అంశంపై ఈ పోటీలను నిర్వహించారు. 50 మంది విద్యార్థులు తమ వద్ద ఉన్న సెల్ ఫోన్ల ద్వారా ఈ పోటీల్లో పాల్గొన్నారని ప్రిన్సిపాల్ కె.వల్లీమాధవి తెలిపారు. ఎన్ఎస్ఎస్ పీఓ కాళీకృష్ణ, హెచ్‌ఓడీసీ హెచ్ వెంకటేశ్వర్లు, ఏఓ బీహెచ్ఎస్ఎస్ రాజు పాల్గొన్నారు.

సమస్యలుంటే ఫోన్ చేయండి

రాజానగరం: నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలున్నా వాటి పరిష్కారానికి సత్వరమే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాగు, సాగునీరు, డ్రైనేజీలు, రోడ్లు, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డు, వీధి దీపాలు, భూ రీసర్వేలు, సమస్య ఉంటే 97085 99999 నంబరుకు చెప్పడంతోపాటు లిఖిత పూర్వకంగా వాట్సాప్ చేయవచ్చన్నారు.